బైబై.. ఇక సెలవు..



- ఇతర పార్టీల వైపు బీఆర్ఎస్ నేతల చూపులు
- కొందరు నేతలు కాంగ్రెస్.. మరికొందరు బీజేపీ వైపు..
- జంపింగ్ నేతలను పట్టించుకోని ఎమ్మెల్యే మల్లారెడ్డి
- ఎవరి ఇష్టం వారిదంటున్న బీఆర్ఎస్ అగ్ర నాయకులు

మేడ్చల్: పదేళ్ల క్రితం బీఆర్ఎస్ సునామీలో ఇతర పార్టీల నేతలు బంగారు తెలంగాణ సాధన కోసమని, గ్రామాలు, తమ ప్రాంతాల అభివృద్ధి కోసమని అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌లోకి చేరడంతో ఖాళీ అయిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలోకి తిరిగి బీఆర్ఎస్ నుంచి వలసలు ప్రారంభమయ్యాయి. ఇన్నేళ్లు కారు ఓవర్‌లోడ్‌తో ప్రయాణించగా తాజాగా ఒక్కొక్కరు కారు దిగిపోతున్నారు. కొంతమంది కాంగ్రెస్ వైపు మరికొందరు బీజేపీ వైపు అడుగులు వేస్తున్నారు.

మల్లారెడ్డి పట్టు వదిలేస్తుండటంతో..

మేడ్చల్ ఎమ్మెల్యే నియోజకవర్గ బీఆర్ఎస్‌పై పట్టు వదిలేస్తుండటంతో నాయకులు మెల్లగా జారుకుంటున్నారు. ఎన్నికలకు ముందు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు సత్యనారాయణ, విష్ణు తదితర నేతలు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పారు. మల్లారెడ్డి బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచినా ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాల వల్ల ప్రభుత్వం నుంచి ఎదురైన చర్యలతో ఒక్కసారిగా డీలా పడ్డారు. అల్లుడి ఆస్తులపై, తన ఆస్తులపై పాత ఫిర్యాదులను సాకుగా చూపి ప్రభుత్వ పెద్దలు ఫిర్యాదు చేసి సంవత్సరాలు గడిచిన తర్వాత చర్యలకు పూనుకోవడం, మల్లారెడ్డి, ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి స్వయంగా కాంగ్రెస్ నేతలను, ప్రభుత్వ పెద్దలను కలిసి సమస్యకు తాత్కాలిక చెక్ పెట్టినా కలత చెందిన మల్లారెడ్డి ఏకంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వద్దకు వెళ్లి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి తమ కుటుంబ సభ్యులు పోటీ చేయరని చెప్పాడంటే ఆయన బీఆర్ఎస్‌పై ఎంత పట్టు సాధించారో స్పష్టం అవుతోంది.

తానేమీ చేయలేనని..

కాంగ్రెస్‌తో పోరాటం చేస్తే తమకే ఎసరు వస్తుందనే భావనలో మల్లారెడ్డి కుటుంబం ఉన్నట్లు స్థానిక బీఆర్ఎస్ నాయకులు గుసగుసలాడుతున్నారు. ఈ కారణంగానే కౌన్సిలర్లు అసమ్మతి రేపుతున్నా, నాయకులు ఇతర పార్టీల్లో చేరుతున్నా ఆయన కనీసం వారిని అడ్డుకోవడం లేదని, సిసలైన బీఆర్ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాయకులు పార్టీలు మారకుండా చూడాలని, వారిని ఆపాలని కోరుతున్నా ఎవరి ఇష్టం వారిది తానేమీ చేయలేనని చేతులెత్తేస్తున్నారని, నాయకులే చెబుతున్నారు.

ఇతర పార్టీల వైపు.. నేతల చూపు..

నియోజకవర్గంలోని జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో మెజార్టీ బీఆర్ఎస్ కార్పొరేటర్లు పార్టీపై తిరుగుబాటు చేసి మేయర్‌ను దించి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. నాగారం మున్సిపాలిటీ చైర్మన్ సీనియర్ నేత చంద్రారెడ్డి బీజేపీలోకి వెళ్తున్నట్లు అనధికారికంగా ప్రకటించారు. అవిశ్వాసంలో జెడ్పీ చైర్మన్ పదవి వస్తుందని ఆశపడ్డ మేడ్చల్ జెడ్పీటీసీ సభ్యురాలు శైలజారెడ్డి, ఆమె భర్త జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన విజయానంద్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరినా వారిని నిలువరించలేకపోయారు. ఆయన బాటలో మరికొంత మంది నేతలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. మేడ్చల్ మున్సిపాలిటీకి చెందిన పది మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు అసమ్మతి బావుట ఎగురవేసి సోమవారం రహస్య సమావేశం పెట్టుకున్నా కనీసం వారిని వారించలేకపోయారు. వారు కాంగ్రెస్ నాయకులతో సమావేశమై బీఆర్ఎస్ నుంచి వెళ్లిపోతున్నారనే విషయాలు బహిరంగంగానే ఉన్నా అడ్డుకునే వారు లేకుండా పోయారు.

రేపోమాపో బీఆర్ఎస్‌కు గుడ్‌బై..

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో నలుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరేందుకు ముహూర్తాలు ఖరారు చేసుకున్నా.. వారి ఇష్టం వారు ఎటైనా వెళతారని బీఆర్ఎస్ అగ్ర నాయకులే అంటున్నారు. మరోవైపు మండల సీనియర్ రాజకీయవేత్త నారెడ్డి నందారెడ్డి బీజేపీలో చేరుతున్నారు. ఆయన బీజేపీ మండల, గ్రామాల నాయకులతో ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించి రేపో మాపో బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆయన కూతురు వాణిరెడ్డిని బీజేపీలో చేర్పించి నాయకులతో కలిపి గ్రౌండ్ వర్క్ చేయిస్తున్నారు. నందారెడ్డి వెంట ప్రధాన నాయకులందరినీ బీజేపీలో చేర్చడానికి నిత్యం రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారు.

బీఆర్ఎస్‌లో.. నాడు జంప్ చేసిన వారే..

మేడ్చల్ బీఆర్ఎస్‌లో జంప్ చేసిన నాయకులే అధికం ఉండటంతో అధికారంపై ధ్యాస ఉన్న వారే ఉండటం, ప్రభుత్వం మారడం, ఎమ్మెల్యే మల్లారెడ్డి పార్టీ కోసం పెద్దగా పట్టించుకోకపోవడంతో మేడ్చల్ బీఆర్ఎస్ నుంచి ఇతర పార్టీలకు నాయకుల వలసలు జోరుగా సాగుతున్నాయి. బీఆర్ఎస్ స్థాపించినప్పటి నుంచి ఆ పార్టీలో ఉన్న నాయకులు వేళ్లమీద లెక్క పెట్టేంత మందే ఉన్నారు. చాలామంది నాయకులు ఆ పార్టీని ఎప్పుడో వదిలిపెట్టారు. కొంతమంది అందులో కొనసాగుతున్నా వారికి ప్రాధాన్యం తక్కువ. పార్టీల్లో అధిక మంది టీడీపీ, కాంగ్రెస్, బీజేపీ నాయకులైన వారే అధికంగా ఉన్నారు. బంగారు తెలంగాణ సాధన కోసమని, పదవుల కోసమని, అధికారం కోసమని బీఆర్ఎస్‌లో చేరిన వారే.. విలువలు తక్కువ.. ఆశలు ఎక్కువగా ఉన్న నాయకులు ఎటు వాటమైతే అటు వెళ్లేవారు బీఆర్ఎస్‌లో ఎక్కువగా ఉండటంతో వారు పార్టీ అధికారంలో ఉన్నన్ని రోజులు అక్కడే ఉండి పార్టీ ప్రతిపక్షంలోకి రాగానే అధికార పార్టీలోకి వెళ్తున్నారు. కండువాలను సులువుగా మార్చే నాయకులతో ఒకనాడు బీఆర్ఎస్ ఫుల్‌గా ఉండగా.. నేడు ఖాళీ అవుతోంది. నాడు బీఆర్ఎస్ అవలంభించిన సిద్ధాంతాలనే నేడు ఇతర పార్టీలు అవలంభిస్తుండటంతో పదేళ్ల పాటు వెలుగులతో కనిపించిన బీఆర్ఎస్ నేడు కళ తప్పినట్లు కనిపిస్తోంది.

ఎస్ఎఫ్ఐ పోరాటంతోనే గురుకుల్‌కు నిధులు

ఘట్‌కేసర్: ఎస్ఎఫ్ఐ పోరాటం ఫలితంగానే ఘట్‌కేసర్ గురుకుల్ జూనియర్ కళాశాల అభివృద్ధికి రూ.1.5 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఘట్‌కేసర్‌లో ఆయన మాట్లాడుతూ గురుకుల్ భూమిని రక్షించాలని, ప్రహరీ నిర్మించాలని, అందులో విద్యాసంస్థలను అభివృద్ధి చేయాలని గురుకుల్ నుంచి కీసర పాత కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర చేపట్టామని గుర్తు చేశారు. గురుకుల్ ఆవరణలో కేజీ నుంచి పీజీ వరకు పేదల కోసం విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలని, గురుకుల్ అభివృద్ధికి నిధులు కేటాయించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలన్నారు.

అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు



ప్రొసీడింగ్ అందజేస్తున్న వజ్రేశ్‌యాదవ్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని గురుకుల్ జూనియర్ కళాశాల అభివృద్ధికి మాజీ సర్పంచ్ యాదగిరి యాదవ్ వినతి మేరకు టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్ రూ.కోటి 50 లక్షలు ప్రభుత్వంతో మంజూరు చేయించారు. అలాగే మున్సిపాలిటీలోని 1, 2, 3 వార్డుల్లో నీటి పైపులైన్ కోసం మూడో వార్డు కౌన్సిలర్ సంగీతప్రభాకర్‌రెడ్డి అభ్యర్థన మేరకు ప్రత్యేక అభివృద్ధి నిధుల నుంచి రూ.15 లక్షలు మంజూరు చేయించి మంగళవారం ప్రొసీడింగ్ అందజేశారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



ఎస్సీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ రజితరెడ్డి

మేడ్చల్: మండలంలోని డబీల్‌పూర్ గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనానికి ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.10 లక్షలతో గ్రామంలో ఎస్సీల ఆత్మగౌరవం కోసం భవనం నిర్మిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హేమలత, మాజీ సర్పంచ్‌లు రాజమల్లారెడ్డి, గీత భాగ్యారెడ్డి, మాజీ ఉపసర్పంచ్‌లు సత్యనారాయణ, అశోక్, నాయకులు టి.అశోక్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

కోనాయిపల్లి మహిళా రైతుకు డ్రోన్



డ్రోన్‌తో రైతు మాధవి, నాయకులు

మేడ్చల్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన నమో డ్రోన్.. దీదీ డ్రోన్ స్కీమ్ కింద మండలంలోని కోనాయిపల్లికి చెందిన మహిళా రైతు మాధవికి డ్రోన్ లభించింది. వ్యవసాయరంగంలో ఆధునిక, సంప్రదాయ సాగులో ప్రతిభ కనబర్చి ఆదర్శ మహిళా రైతుగా ఎదుగుతున్న మాధవిని గుర్తించి ఈ పథకం కింద ఎంపిక చేశారు. పంటలపై ద్రవణాలు పిచికారీ చేసేందుకు ఉపయోగించే రూ.8 లక్షల విలువ చేసే డ్రోన్‌ను అధికారులు హైదరాబాద్‌లో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అందజేశారు. డబీల్‌పూర్ పీఏసీఎస్ చైర్మన్ సురేష్‌రెడ్డి, రైతులు కుమార్, దీపక్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి..



జవహర్‌నగర్: మహిళా స్వయం సంఘాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి మంగళవారం కార్పొరేషన్‌లోని మహిళా సంఘం సభ్యులు తరలివెళ్లారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమిషనర్ హాజరై బస్సును ప్రారంభించారు.

అభినందనలు



జగదీశ్వర్‌కు అభినందనలు తెలుపుతున్న ప్రభాకర్‌యాదవ్

జవహర్‌నగర్: టీఎస్‌జీవో సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నికైన జగదీశ్వర్‌ను తెలంగాణ మున్సిపల్ యూనియన్ నాయకులు అభినందలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ మున్సిపల్ సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు జి.ప్రభాకర్‌యాదవ్ సమక్షంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ సెంట్రల్ ఫోరం ప్రధాన కార్యదర్శి వెంకటగోపాల్, కోశాధికారి గుత్తా శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు జి.రవీందర్‌రెడ్డి, డి.నరేందర్‌రెడ్డి, జి.శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల స్థలంపై కార్పొరేటర్ కన్ను

- నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కబ్జా
- జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు



కార్పొరేటర్ పల్లపు రవి

జవహర్‌నగర్: పేదల ఇంటి స్థలంపై ఓ కార్పొరేటర్ కన్ను పడింది. ఏకంగా తప్పుడు నోటరీలు సృష్టించి విద్యుత్ మీటర్‌ను సైతం మార్చేశాడు. ఆపై ఎవరికి చెబుతారో చెప్పుకోండి అని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీజేఆర్‌నగర్‌లో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్‌కు చెందిన ఒడ్లకొండ రాజు 2015 సంవత్సరంలో 200 గజాల స్థలాన్ని కొనుగోలు చేశాడు. కొన్ని రోజులుగా ఆ ప్లాటులో అదనపు గదులు కట్టాలని రాజు ఏర్పాట్లు చేస్తుండగా స్థానిక కార్పొరేటర్ ఆ స్థలం వద్దకు రావొద్దని బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఆ ప్లాట్‌ను స్థానిక కార్పొరేటర్ పల్లపు రవి తన అనుచరులతో కలిసి కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నాడని, ఆ ఇంటికి ఉన్న పాత కరెంట్ మీటర్‌ను తొలగించి అక్రమ మార్గంలో నూతన మీటర్‌ను తీసుకువచ్చి ఆ రూమ్‌కి పెట్టి కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వారిపై చట్టరీత్యా విచారణ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేసి న్యాయం చేయాలని బాధితుడు పోలీసులను వేడుకున్నారు.



న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు

కార్పొరేటర్ కీచక పర్వం

జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని ఆరవ డివిజన్ కార్పొరేటర్ పల్లపు రవిపై గతంలో ఓ మహిళ లైంగిక దాడికి పాల్పడ్డారని ఫిర్యాదు చేసింది. ఈ ఘటనలో జైలు వెళ్లి వచ్చాడు. అదేవిధంగా ఓ మహిళ ట్యాక్స్ కట్టమని పేపర్లు ఇస్తే 600 గజాల స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నించాడని ఫిర్యాదు చేసింది. గత రెండు నెలలుగా పల్లపు రవి అవిశ్వాసం పేరుతో గోవా, బాపట్ల ప్రాంతాల్లో విలాసవంత జీవితాన్ని గడుపుతున్నాడు.

విద్యుత్ మీటర్ తొలగిస్తాం

గతంలో ఆ ప్లాట్‌లోని గదిలో కరెంట్ లేదని నూతన మీటర్‌ను తీసుకున్నారు. మళ్లీ విచారణ చేసి అక్రమంగా తీసుకున్న మీటర్‌ను తొలగించి అర్హులైన వారికి న్యాయం జరిగేలా చూస్తాం.

– ఏఈ వీరన్న

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మేడ్చల్‌రూరల్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మేడ్చల్ పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్ఐ మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని మల్లిఖార్జున వెంచర్‌లో నివాసం ఉండే మధుసూదన్ రెడ్డి గత సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో మేడ్చల్‌వైపు నడుచుకుంటూ వస్తుండగా నవోదయ వెంచర్ సమీపంలో ఓ వ్యక్తి పడిపోయి కనబడటంతో అతడి వద్దకు వెళ్లి పరిశీలించి చనిపోయినట్లు గుర్తించాడు. ఈ మేరకు మేడ్చల్ పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడికి 35–40 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందని, ఆహారం, నీరు తీసుకోకపోవడంతో చనిపోయి ఉండవచ్చని పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో టీసీఎస్ ఉద్యోగిపై యువకుల దాడి

పోచారం: మద్యం మత్తులో కొందరు యువకులు కారులో ప్రయాణిస్తున్న టీసీఎస్ ఉద్యోగిపై దాడికి పాల్పడిన ఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి జరిగింది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపూర్ సమీపంలోని అనురాగ్ యూనివర్సిటీ దగ్గర రోడ్డుకు అడ్డంగా ఐదుగురు యువకులు బైక్‌లు నిలిపి మద్యం తాగుతున్నారు. అటువైపు కారులో వెళ్తున్న టీసీఎస్ ఉద్యోగి కుర్వ నవీన్ కుమార్ రోడ్డుకు అడ్డుగా ఎందుకు నిలబడ్డారని యువకులను ప్రశ్నించారు. దీంతో ఆవేశానికి గురైన యువకులు నవీన్‌పై దాడికి చేయడంతో భయపడి అక్కడ నుంచి వెళ్లిపోయాడు. రెచ్చిపోయిన యువకులు కారులో వెళ్తున్న నవీన్‌ను వెంబడించి నారపల్లిలోని నందనవనం వద్ద అడ్డుకుని రాళ్లతో కారును ధ్వంసం చేసి, అతడిని చితకబాదారు. గాయాలపాలైన బాధితుడు పోచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అకౌంట్ నుంచి నగదు చోరీ

పోచారం: అకౌంట్ నుంచి నగదు చోరీకి గురైన ఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 1న ఎస్‌బీఐ నెట్ బ్యాంకింగ్ పాస్‌వర్డ్ మార్చుకోవాలని సంస్కృతి టౌన్‌షిప్‌కు చెందిన కాజా వెంకటేశ్వర్‌రావు(65)కు ఫోన్‌లో మెసేజ్ వచ్చింది. కొత్త పాస్‌వర్డ్ ఏర్పాటు చేసుకునేందుకు మెసేజ్‌తో పాటు వచ్చిన లింక్‌పై క్లిక్ చేశారు. తర్వాత అకౌంట్ ఐటీ, పాస్‌వర్డ్, ఓటీపీలను ఫీడ్ చేసిన కొద్దిసేపటికి తన అకౌంట్ నుంచి రూ.1.24 లక్షలు తెలియని అకౌంట్‌కు బదిలీ అయినట్లు మెసేజ్ వచ్చింది. నిర్ధారణ కోసం బ్యాంకు అధికారులు ఫోన్ చేయడం జరిగింది. తాను ఎవరికీ డబ్బు బదిలీ చేయలేదని చెప్పడంతో సైబర్ నేరగాళ్లు ఈ పని చేసినట్లు గుర్తించారు. బ్యాంకు అధికారులకు అకౌంట్ వివరాలు తెలియకపోవడంతో మంగళవారం పోచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధికి రూ.38 లక్షల నిధులు

కీసర: మున్సిపాలిటీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకెళ్తోందని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. నాగారం మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులు చేపట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.38 లక్షల నిధులను కేటాయించిందని, ఈ మేరకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు నిధుల మంజూరుకు సంబంధించిన జీవో కాపీ అందజేసినట్లు చెప్పారు. ఈ నిధులతో నాగారం మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీ పనులను త్వరలో చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.



ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ రాజేంద్ర కుమార్‌కు జీవో కాపీని అందజేయడం జరిగిందన్నారు. నాగారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, దమ్మాయిగూడ మున్సిపల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రసవ సమయంలో శిశువు మృతి



ఆందోళన చేస్తున్న కుటుంబీకులు

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన

మేడ్చల్‌రూరల్: ప్రసవం కోసం వచ్చిన గర్భిణికి డెలివరీ చేసిన వైద్యులు శిశువు గర్భంలోనే మరణించిందని తెలపగా వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువులు ఆందోళన చేసిన ఘటన మేడ్చల్ పట్టణంలోని ప్రజ్ఞా ఆస్పత్రిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మేడ్చల్ పట్టణానికి చెందిన సంకీర్తన స్థానిక ప్రజ్ఞా ఆస్పత్రిలో గర్భం దాల్చిన సమయం నుంచి పరీక్షలు చేయిచుకుంటోంది. పురిటి నొప్పులు రావడంతో భర్త శ్రీకాంత్, కుటుంబ సభ్యులు ఆమెను ప్రజ్ఞా ఆస్పత్రికి తీసుకెళ్లి అడ్మిట్ చేశారు. మంగళవారం మధ్యాహ్నం ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లిన వైద్యులు సాయంత్రం 5 గంటలకు శిశువు చనిపోయిందని వెల్లడించారు. దీంతో ఆగ్రహించిన కుటుంబీకులు, బంధువులు ఆరోగ్యంగా ఉన్న పాప ఎలా చనిపోతుందంటూ ఆస్పత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. జూనియర్ వైద్యులు వైద్యం చేయడంతో పాప చనిపోయిందన్నారు. మేడ్చల్ పోలీసులు ఆస్పత్రికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. ఈ ఘటనపై పోలీసులను ఆశ్రయిస్తామని బాధితులు తెలిపారు. కాగా ఘటనకు వైద్యుల నిర్లక్ష్యం కారణం కాదని, ప్రసవ సమయంలో శిశువు పల్స్‌రేట్, హార్ట్‌బీట్ ఆగిపోవడంతో మరణించిందని, ఈ విషయం తండ్రికి ముందుగానే వివరించినట్లు తెలిపారు.

100 శాతం పన్నుల వసూళ్లపై దృష్టి

- నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీలో 2023–24 ఏడాదికి సంబంధించి నూటికి నూరు శాతం పన్నులు వసూలు చేసేందుకు దృష్టి సారించడం జరిగిందని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కమిషనర్ రాజేంద్రకుమార్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో పన్నుల వసూళ్లపై వార్డు ఆఫీసర్లు, బిల్‌కలెక్టర్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇంటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్‌లు 100 శాతం వసూలు చేయాలని, బిల్ కలెక్టర్లు, లైసెన్స్ ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్నులు బకాయి ఉన్నవారికి రెడ్ నోటీసు జారీ చేయాలని బిల్‌కలెక్టర్లను ఆదేశించారు. అనంతరం నాగారం మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులతో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా ఆత్మీయ సమ్మేళనం సభకు మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన బస్సును మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కమిషనర్ రాజేంద్రకుమార్, జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, కమిషనర్ రాజేంద్రకుమార్

ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న సర్వే బిల్లులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ రఘునాథ్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఆశ కార్యకర్తలకు గతంలో ఇచ్చిన యూనిఫాంలు, నాణ్యత లేకపోవడంతో తొందరగా పాడైపోయాయని, ఈ ఏడాది నాణ్యత కలిగిన యూనిఫాంలను ఇవ్వాలని కోరారు. జిల్లాలోని పీహెచ్‌సీల్లో ఏఎన్ఎంలు చేయాల్సిన పనులను ఆశాలతో చేయిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో ఆశాలు విపరీతమైన ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. అలాగే, ఆశ కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాలపై శ్రద్ధ చూపించి, న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కమిటీ(సీఐటీయూ) కార్యదర్శి రేవతి కళ్యాణి, సీఐటీయూ జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణన్, నాయకురాళ్లు రాధ, మంగ, లలిత, కవిత పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌ను మోడల్ పట్టణంగా తీర్చిదిద్దుతాం



మాట్లాడుతున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌ను మోడల్ పట్టణంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ అధ్యక్షతన, కమిషనర్ సాబేర్ అలీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో బడ్జెట్ ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.2.96 కోట్లతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఒక్కో వార్డులో రూ.10 లక్షల చొప్పున నీటి సరఫరా లైన్ పనులకు రూ.1.8 కోట్లు కలుపుకొని, డ్రైనేజీ మరమ్మతులు, ప్యాచ్ వర్క్‌లు, ఇతర పనులకు మొత్తం రూ.2.93 కోట్ల పనులకు ఆమోదం తెలిపామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, రమాదేవి, సంగీత, ఆంజనేయులుగౌడ్, అనురాధ, నస్రీన్ సుల్తానా, నాగజ్యోతి, హేమలత, శశికళ, మల్లేశ్, జహంగీర్, వసంత, నరేశ్‌యాదవ్, నర్సింగ్‌రావు, రవీందర్, కోఆప్షన్ సభ్యులు, బి.అరుణ, సురేందర్‌రెడ్డి, పి.అరుణ, షౌకత్, ఏఈ నరేశ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



ఘట్‌కేసర్: ఉజ్వల గ్యాస్ కనెక్షన్ లబ్ధిదారుల గ్యాస్ సిలిండర్‌పై కేంద్రం రూ.100 తగ్గించినందుకు, సీఏఏ నోటిఫికేషన్ జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు విప్పర్ల హనుమాన్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి రామతీర్థ, మధుగౌడ్, శ్రీనివాస్, చందు, మోహన్‌రావు, వీరేశం, నరేశ్‌ముదిరాజ్, సాయికృష్ణ, సిద్దిరాజ్, శరత్, పవన్‌యాదవ్, హరికృష్ణ, సురేంద్ర, పవన్, ఉదయ్, శోభన్ బాబు, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

మేడ్చల్‌రూరల్: ఇద్దరు పిల్లలతో పాటు ఇంటి నుంచి వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన భూషన్ పటేల్ కొంతకాలంగా కుటుంబంతో కలిసి మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి అత్వెల్లిలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 10న భూషన్ మధ్యాహ్నం మార్కెట్‌కు వెళ్లిన భూషన్ సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చే సరికి ఇంట్లో ఉన్న భార్య రామ్‌భీ(30), కుమారులు ధానేశ్వర్(4), వీర్(2) కనిపించలేదు. ఆచూకీ కోసం వెతికినా లభ్యం కాకపోవడంతో మంగళవారం మేడ్చల్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వారిపై కేసు

ఘట్‌కేసర్: విధుల్లో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వారిపై కేసు ఘట్‌కేసర్ పీఎస్‌లో కేసు నమోదైంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం ఓ ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఈసీఐఎల్ నుంచి ఘట్‌కేసర్‌కు వస్తుండగా మంగళవారం సాయంత్రం శివారెడ్డిగూడ మూలమలుపు వద్ద మారుతి కారు నడుపుతున్న వ్యక్తి వేగంగా వచ్చి బస్సును ఢీకొట్టాడు. కారులో ఉన్న వ్యక్తులు బస్సు డ్రైవర్‌ను దూషిస్తూ శివ, వాజిద్ బస్సులోకి వెళ్లి డ్రైవర్‌పై దాడి చేశారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామన్నారు. చికిత్స నిమిత్తం డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించామన్నారు.

రోడ్డుపై నిర్మించిన గోడను తొలగించాలని కలెక్టర్‌కు వినతి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని మూడో వార్డు బొక్కోనిగూడ గ్రామంలో స్థానికుడు మాధవరెడ్డి రోడ్డుపై నిర్మించిన గోడను తొలగించాలని గ్రామస్తులు మంగళవారం కలెక్టర్, మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. రోడ్డుపై గోడ నిర్మించడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని లేఖలో తెలిపారు. ఈ విషయమై విచారణ జరిపి సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని జంగమ్మ, పద్మ, శేఖర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి వినతి పత్రం అందజేశారు.

యువకుడికి రెండు రోజుల జైలు

అల్వాల్: మద్యం మత్తులో అర్ధరాత్రి రోడ్డుపై తిరుగుతూ పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన యువకుడికి మల్కాజిగిరి న్యాయస్థానం రెండు రోజుల జైలుశిక్ష విధించింది. నేరేడ్‌మెట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక్‌నగర్‌లో నివాసముండే తులసి పవన్‌కుమార్(23) ఈ నెల 11వ తేదీన వినాయక్ నగర్‌లో గొడవ చేస్తున్నారనే సమాచారంతో పోలీసులు వెళ్లగా మద్యం మత్తులో పోలీసులపై దురుసుగా ప్రవర్తించాడు. దీంతో పోలీసులు తులసి పవన్‌కుమార్‌ను అరెస్టు చేసి మల్కాజిగిరి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం రెండు రోజుల జైలు శిక్ష, రూ.600 జరిమానా విధించింది.